# నూరేళ్లుగా గూర్ఖాల డిమాండ్..!

**ఉత్తర బెంగాల్‌లోని మూడు పర్వత ప్రాంతాలు(హిల్ డివిజన్లు) డార్జిలింగ్, కాలింపాంగ్, కుర్సియాంగ్‌లను... పక్కనే ఉన్న సిలిగురి, దువారస్(కూచ్‌బీహార్ జిల్లా)లతో కలిపి, ప్రత్యేక గూర్ఖాలాండ్ రాష్ట్రం ఏర్పాటు చేయాలనే ఉద్యమం 22 ఏళ్ల తర్వాత మళ్లీ ఊపందుకుంది. 1986లో జనాదరణ పొందిన నవలా రచయిత సుభాష్ ఘీషింగ్ నాయకత్వంలోని గూర్ఖా నేషనల్ లిబరేషన్ ఫ్రంట్(జీఎన్ఎల్ఎఫ్) గూర్ఖా ఆందోళనకు నేతృత్వం వహించింది. యువనేత బిమల్ గురుంగ్ నేతత్వంలోని గూర్ఖా జనముక్తి మోర్చా(జీజేఎం) నేటి హింసాత్మక ఉద్యమాన్ని నడుపుతోంది!!**

డార్జిలింగ్ బ్రిటిష్ కాలం నుంచే ప్రపంచ వ్యాప్తంగా పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. ఈ ప్రాంతంలోని తేయాకు పరిశ్రమ కోట్లాది రూపాయల ఆదాయం తెచ్చిపెడుతోంది. పశ్చిమ బెంగాల్ సర్కార్లు తమను నిర్లక్ష్యంచేస్తున్నాయంటూ... జీఎన్ఎల్ఎఫ్ నేత ఘీషింగ్ రెండు దశాబ్దాల క్రితం బంద్‌లు, . ధర్నాలు, దాడులతో అందరి దృష్టిని ఆకర్షించారు. నేపాలీ మాట్లాడే గూర్ఖాల జీవన స్థితిగతులు మారాలంటే... ప్రత్యేక రాష్ట్రం ఒక్కటే పరిష్కారమంటూ... ఉద్యమించిన జీఎన్ఎల్ఎఫ్, వేలాది మందిని సంఘటిత పరిచింది. నిరంతరం బంద్‌లు, హింసాకాండతో ప్రజాజీవనం అస్తవ్యస్త మైంది. కొంతకాలానికి కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవడంతో... జీఎన్ఎల్ఎఫ్, జ్యోతి బసు నాయకత్వంలోని వామపక్ష ప్రభుత్వం మధ్య ఒప్పందం కుదిరింది.

## హిల్ కౌన్సిల్ ఏర్పాటు:

సొంత రాష్ట్రం కావాలన్న డిమాండ్‌ను పక్కన పెట్టి... పరిమిత స్వయంప్రతిపత్తి గల డార్జిలింగ్ గూర్ఖా హిల్ కౌన్సిల్ (డీజీహెచ్‌సీ) ఏర్పాటు ప్రతిపాదనకు ఘీషింగ్ అంగీకరించడంతో... డార్జిలింగ్ కొండల్లో మళ్లీ ప్రశాంతత నెలకొంది. ఆ తర్వాత జరిగిన హిల్ కౌన్సిల్ ఎన్నికల్లో జీఎన్ఎల్ఎఫ్ విజయం సాధించింది. ఘీషింగ్ డీజీహెచ్‌సీకి చైర్మన్ అయ్యారు. ఇలా వరుసగా జరిగిన ఎన్నికల్లో గెలుస్తూ... ఆయన ఈ పదవిలో 18 ఏళ్లు కొనసాగారు. అయినా ఈ ప్రాంతంలో నివసించే గూర్ఖాల ప్రగతికి కౌన్సిల్ ఏమీ చేయలేకపోయిందనే అసంతృప్తి ప్రజల్లో నెలకొంది. జనం ఆందోళన గమనించిన ఘీషింగ్.. డార్జిలింగ్‌కు రాజ్యాంగంలోని ఆరో షెడ్యూలు హోదా కల్పించాలని కేంద్రంపై ఒత్తిడి తేవడం ప్రాంభించారు. హిల్ కౌన్సిల్, ఆరో షెడ్యూలు హోదాలతో ఒరిగేదేమీ ఉండదంటూ... గతంలో కౌన్సిల్ సభ్యుడిగా పనిచేసిన బిమల్ గురుంగ్ అనే 36 ఏళ్ల గూర్ఖా నేత.. 2007లో గూర్ఖా జనముక్తి మోర్చా(జీజేఎం)ను ప్రారంభించారు. కడపటి కౌన్సిల్ పదవీకాలం 2004లోనే ముగిసినా... అనేక రాజకీయ కారణాలవల్ల ఎన్నికలు జరగలేదు. బుద్ధదేవ్ భట్టాచార్య ప్రభుత్వం జీఎన్ఎల్ఎఫ్ నేతను ఆపధర్మ అధికారిగా నియమించింది. ప్రతి ఆరు నెలలకూ ఆయన పదవీకాలాన్ని పొడిగిస్తూ వచ్చింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర సర్కారుపైనా.. ఘీషింగ్ నాయకత్వంపైనా.. అసంతృప్తితో ఉన్న గూర్ఖాలను తన వైపు తిప్పుకోవడంలో

బిమల్ గురుంగ్ సఫలమయ్యారు.

## తప్పుకున్న ఘీషింగ్:

బెంగాల్ ప్రభుత్వం చేతిలో పావుగా మారిన ఘీషింగ్‌ను.. కౌన్సిల్ పదవికి రాజీనామా చేసే వరకూ డార్జిలింగ్‌లోకి అడగుపెట్టనీయమని ఉద్యమించిన జీజేఎం.. విజయం సాధించింది. జనాగ్రహానికి గురైన ఘీషింగ్ చివరికి పదవి నుంచి తప్పుకోక తప్పలేదు. మరోవైపు జీజేఎం గత రెండు నెలలుగా డార్జిలింగ్, దాని చుట్టు పక్కల ప్రాంతాల్లో ఆందోళన తీవ్రతరం చేసింది. నిరవధిక హర్తాళ్లతో జనం నానా కష్టాలు పడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యా సంస్థలు మూతపడ్డాయి. విదేశీ టూరిస్టులపై సైతం దాడులు జరిగాయి. ఈలోగా కేంద్రంలోని యూపీఏ సర్కారు చొరవతో చర్చలకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. జూన్ 28న పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం కోల్‌కతాలో ఏర్పాటు చేసిన సమావేశానికి జీజేఎం ప్రతినిధులు హాజరయ్యారు. అయితే రాష్ట్ర ప్రభుత్వంతో జరిగే చర్చలకు ఇక ముందు హాజరుకాబోమని బిమల్ గురుంగ్ పార్టీ నేతలు తాజాగా ప్రకటించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేసే అధికారం పార్లమెంటుకే ఉంది.. కాబట్టి భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వంతో మాత్రమే చర్చిస్తామని జీజేఎం స్పష్టం చేసింది.

## డార్జిలింగ్ నేపథ్యం:

నేపాలీ భాష మాట్లాడే ప్రజలు మెజారిటీగా ఉన్న ప్రస్తుత సిక్కిం.. 1975లో భారతదేశంలో విలీనమైంది. కొన్ని శతాబ్దాలు స్వతంత్ర రాజ్యంగా కొనసాగిన సిక్కింలో.. 250 ఏళ్ల క్రితం డార్జిలింగ్ ప్రాంతం అంతర్భాగంగా ఉండేది. అప్పట్లో సిక్కిం, నేపాల్ వరకూ విస్తరించి ఉండేది. నేపాల్ రాజు పృథ్వీనారాయణ్ షా తన సేనలతో దండెత్తి డార్జిలింగ్‌ను ఆక్రమించు కున్నారు. చివరికి 1816లో జరిగిన సుగౌలీ సంధి ప్రకారం... ఆయన డార్జిలింగ్ సహా పది వేల చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీకి అప్పగించారు. మళ్లీ మరుసటి ఏడాదే బ్రిటిషర్లు తితల్యా ఒప్పందం ప్రకారం.. మేచీ, తీస్తా నదుల మధ్య ఉన్న ప్రాంతాన్ని సిక్కిం రాజు చోగ్యాల్‌కు బదిలీ చేశారు. 18 ఏళ్ల తర్వాత 1835లో ఈస్టిండియా కంపెనీతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని అనుసరించి... డార్జిలింగ్‌ను సిక్కిం పాలకుడు లీజుకిచ్చారు. ఇందుకు బ్రిటిష్ కంపెనీ, చోగ్యాల్‌కు ఆరు వేల రూపాయల నష్టపరిహారం కూడా చెల్లించింది. దాంతో డార్జిలింగ్‌కు జనం వలసరావడం పెరిగింది. మొదట శానిటోరియం నిర్మాణంతో ప్రారంభమైన ఈ ప్రాంతం అభివృద్ధి... కొండలపై అడవులు నరికి, తేయాకు తోటలు వేయడంతో వేగం పుంజుకుంది. అప్పటికే అక్కడ నివసిస్తున్న లెప్చాలు, భూటియాలతో నేపాల్ నుంచి వచ్చిన గూర్ఖాలు జత కలిశారు. తోటల్లో కూలీలుగా పనిచేయడానికి జార్ఖండ్ నుంచి ఆదివాసీలు పెద్ద సంఖ్యలో వచ్చారు. టీ కంపెనీల్లో మేనేజర్లుగా, గుమస్తాలుగా పనిచేయడానికి బెంగాలీలు వలసవచ్చారు. ఇంకా అనేక సంస్థల్లో బెంగాలీలకు(మున్సిపాలిటీ, స్కూళ్లు) ఉపాధి లభించింది. బెంగాల్‌తో సంబంధం

లేకుండా తమకు ప్రత్యేక పాలనా వ్యవస్థ కావాలని 1907లోనే డార్జిలింగ్ హిల్‌మెన్స్ అసోసియేషన్ బ్రిటిష్ ప్రభుత్వానికి విన్నవించినా ఫలితం లేకపోయింది. రాజ్యాంగ రచనాకాలంలో... గూర్ఖాలను మైనారిటీలుగా గుర్తించడం ద్వారా వారికి న్యాయం చేయాలని రాజ్యాంగ పరిషత్ సభ్యుడు డి.ఎస్.గురుంగ్ కోరారు. స్వాతంత్ర్యం వచ్చాక రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ జరిగింది. ఫలితంగా డార్జిలింగ్, దువారస్ ప్రాంతాలు పశ్చిమ బెంగాల్లో భాగమయ్యాయి. 1950లో ప్రభుత్వం జారీచేసిన ప్రత్యేక గెజిట్ నోటిఫికేషన్ ద్వారా... డార్జిలింగ్, సిలిగురి, దువారస్‌లో స్థిరపడిన గూర్ఖాలకు భారత పౌరసత్వం లభించింది. దీనికితోడు 1975లో సిక్కిం విలీనంతో గూర్ఖాల సమస్య సమసిపోయిందని భావించిన కేంద్రం, బెంగాల్ ప్రభుత్వాలకు పదకొండేళ్లకల్లా అసలు సమస్య జీఎన్ఎల్ఎఫ్ రూపంలో ఎదురైంది.

## నేపాలీలుగా భావిస్తున్నారనే:

నేపాల్ నుంచి ఎప్పుడో వచ్చిన తమకు తమ పేరు(గూర్ఖా)తో సొంత రాష్ట్రం లేకపోవడంతో... తమను దేశంలో నేపాలీలుగానే భావిస్తున్నారన్నది గూర్ఖాల ప్రధాన ఫిర్యాదు. అయితే, నేపాలీ మాట్లాడే ప్రజలు మెజారిటీగా ఉన్న సిక్కింలో నేపాలీ తెగకుచెందినవారే పాలకులుగా ఉన్నారని చెబుతున్నా... వారు సంతృప్తిచెందడంలేదు. అవసరమ నుకుంటే... సిక్కింను తమతో కలిపి గూర్ఖాలాండ్ రాష్ట్రం ఏర్పాటు చేయాలని గూర్ఖా పార్టీల నేతలు పట్టుబడుతున్నారు . జీఎన్ఎల్ఎఫ్ పాలనపైనా, దాని నేతల పనితీరుపైనా తీవ్ర అసంతృప్తితో ఉన్న డార్జిలింగ్ గూర్ఖాలు... ఇప్పుడు జీజేఎం నేత బిమల్ గురుంగ్ నాయత్వంలో సంఘటితమవుతున్నారు. పాలక పార్టీ అయిన సీపీఎం సహా అన్ని జాతీయ పార్టీలూ ప్రత్యేక గూర్ఖాలాండ్‌ను వ్యతిరేకిస్తున్నాయి. మరో ఏడాదిలో ఎన్నికలు జరుగనున్న తరుణంలో... కేంద్రం గూర్ఖా సమస్యను చర్చల ద్వారా ఇప్పట్లో పరిష్కరించడం అంత తేలిక కాదు. నిరంతర బంద్‌లతో ఉత్తర బెంగాల్ జిల్లాల ప్రజలు ఇబ్బందులు పడుతుండగా... డార్జిలింగ్‌కు వచ్చే విదేశీ పర్యాటకుల సంఖ్య గణనీయంగా పడిపోతోంది. మరి నూరేళ్ల గూర్ఖాల డిమాండ్‌కు పరిష్కారం ఏ రూపంలో లభిస్తుందనేది అంచనాలకు అందని అంశమే!!

-నాంచారయ్య మెరుగుమాల